## నేడు నర్సంపేట మండలంలో 'పెద్ది' ప్రచారం

నర్సంపేట రూరల్, నవంబర్ 14: ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో రెండో విడుత ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నామాల సత్యనారాయణ, ఈర్ల నర్సింహరాములు తెలిపారు. ఉదయం 8గంటలకు నాగుర్లపల్లి, 9 గంటలకు మాధన్నపేట, 10గంటలకు భోజ్యానాయక్‌తండా, 11గంటలకు భాంజీపేట, 12గంటలకు చంద్రయ్యపల్లి, మధ్యాహ్నం ఒంటిగంటకు రాజేశ్వర్‌రావుపల్లి, భోజన విరామం తర్వాత మధ్యాహ్నం 2గంటలకు దాసరిపల్లి, సాయంత్రం 4 గంటలకు కమ్మపల్లి, 5గంటలకు పర్శనాయక్‌తండా, 6 గంటలకు రాజుపల్లి, 7 గంటలకు ముగ్దుంపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వారు వివరించారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్ బాధ్యులు హాజరుకావాలని కోరారు.

## ఓటు.. విలువైన ఆయుధం


మాట్లాడుతున్న హెచ్‌ఎం జయ

చెన్నారావుపేట, నవంబర్ 14: ఓటు చాలా విలువైన ఆయుధమని, దాని విలువను తల్లిదండ్రులకు తెలియజేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఉప్పరపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయ అన్నారు. మంగళవారం పాఠశాలలో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ విలువైన ఓటును ప్రలోభాలకు గురై అమ్ముకోవద్దని, దీనిపై కుటుంబాలు, గ్రామస్తులతో చర్చ జరిపి అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ఓటు హక్కును నిజాయితీగా వినియోగించుకునేలా విద్యార్థులే ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు శశిధర్, బాలాజీరావు, సంతోష్‌కుమార్, మమత, మాధవి పాల్గొన్నారు.

## ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

నర్సంపేట రూరల్, నవంబర్ 14: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి హెచ్‌ఎంలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలు పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవంలో భాగంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారిన పాఠ్యాంశాలు బోధించారు.


గురిజాల జిల్లా పరిషత్ స్కూల్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు


మహేశ్వరంలో విద్యార్థులకు బహుమతుల ప్రదానం

## సమావేశాలను వినియోగించుకోవాలి

నర్సంపేట రూరల్, నవంబర్ 14: ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఏఎంవో మాలోత్ సారయ్య అన్నారు. మంగళవారం మండలంలోని మాదన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం జరిగింది. ఖానాపురం, నర్సంపేట మండలాల భాషోపాధ్యాయులు (తెలుగు) హాజరు కాగా ఏర్పాటు చేసిన సమావేశంలో సారయ్య మాట్లాడారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని, తెలుగు భాషాభివృద్ధికి, సామర్థ్యాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఉన్నత శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపాధ్యాయులు తరగతి గదిలో విధిగా అమలు చేయాలని సూచించారు. ఎంఎన్‌వో కొర్ర సారయ్య, స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీ ఆలూరి రాంచంద్రు, సీపీడీ సెల్ డైట్ వరంగల్ చక్రవర్తుల శ్రీనివాస్, మహ్మద్ గౌస్, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఏఎంవో మాలోత్ సారయ్య

## ఘనంగా సహకార దినోత్సవం

నెక్కొండ, నవంబర్ 14: అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా నెక్కొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీఈవో మోడెం సురేశ్ జెండా ఆవిష్కరించారు. సహకార సిబ్బంది పొట్లపెల్లి సురేశ్, మహ్మద్ అజ్మత్ పాల్గొన్నారు.


నర్సంపేట: పట్టణంలోని పదో వార్డులో బీఆర్‌ఎస్ ప్రచారం


నర్సంపేట రూరల్: ఇటుకాలపల్లిలో ఇంటింటా ప్రచారం


నర్సంపేట రూరల్ : మాదన్నపేటలో..

# 'పెద్ది'ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

నర్సంపేట, నవంబర్ 14: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి తరఫున బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి పెద్దిని గెలిపించాలని కోరుతున్నారు. నర్సంపేట పట్టణంలోని పదో వార్డు కౌన్సిలర్ నాగిశెట్టి పద్మా ప్రసాద్ మంగళవారం ఇంటింటా ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ పెద్దిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పెద్ది ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు. నర్సంపేట జిల్లా కేంద్రం కాకున్నా మెడికల్ కాలేజీని తీసుకువచ్చారని, జిల్లా స్థాయి ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ కావడం, స్పెషలిస్టులు అందుబాటులో ఉండడంతో ఈ ప్రాంత ప్రజలందరికీ వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌ను కూడా మంజూరు చేయించడంతో ప్రజలకు రోగనిర్ధారణ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. క్రిటికల్ కేర్ సెంటర్, పల్లె దవాఖానలు, డయాలసిస్ సెంటర్, రక్తనిధి కేంద్రం వంటివి ఎన్నో మంజూరు చేయించి, ఇక్కడి ఆస్పత్రిలో ఏర్పాటు చేయించారని తెలిపారు. ప్రజలు ఎమ్మెల్యే పెద్దిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ప్రచారంలో రామస్వామి, శివ పాల్గొన్నారు.


నర్సంపేట రూరల్ : ఆకులతండాలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

### గ్రామాల్లో విస్తృతంగా..

నర్సంపేట రూరల్: 'పెద్ది'ని గెలిపించాలని మండలంలోని శ్రేణులు గ్రామాల్లో మంగళవారం ప్రచారం చేశారు. మాదన్నపేటలో సర్పంచ్ మెలుగూరి చంద్రమౌళి, ఎంపీటీసీ ఊడ్గుల రాంబాబుగౌడ్, ఉప సర్పంచ్ నర్సయ్య, మాజీ సర్పంచ్ ఆకుతోట కుమారస్వామి, క్లస్టర్ ఇన్‌చార్జి కడారి కుమారస్వామి, ముత్తోజిపేటలో సర్పంచ్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మురాల మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి తాళ్లపెల్లి రాంప్రసాద్, మండల కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, ఆకులతండాలో మాజీ సర్పంచ్ భూక్యా కిషన్, శంకర్‌లింగం, రమేశ్, ఇటుకాలపల్లిలో సర్పంచ్ మండల రవీందర్, ఎంపీటీసీ భూక్య వీరన్న, ఉప సర్పంచ్ జమాండ్ల చంద్రమౌళి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్, వార్డు సభ్యుడు వినయ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.


నర్సంపేట: పట్టణంలోని 22వ వార్డులో..


నర్సంపేట రూరల్ : ముత్తోజిపేటలో..

## 'పెద్ది'కి నాగరాజుపల్లి దళితుల మద్దతు

నల్లబెల్లి: దళితుల అభ్యున్నతికి కృషిచేసిన ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి తాము సంపూర్ణ మద్దతుగా ఉంటామని మండలంలోని నాగరాజుపల్లి దళితులు స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ మండల ఎస్సీ సెల్ మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దళిత కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ గోనె శ్రీదేవి ఆధ్వర్యంలో దళిత కాలనీ వాసులు కత్తి ప్రశాంత్, కత్తి యాదమ్మ, సంకినేని అశోక్, మేకల యాకయ్య ఆధ్వర్యంలో 20 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరాయి. వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలిసిన పెద్ది మొదటిసారి గెలిచినప్పుడు అభివృద్ధికి కరోనాతో ఆటంకం ఏర్పడగా సీఎం కేసీఆర్ చొరవతో తక్కువ సమయంలో రెండున్నర ఏండ్లలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ఐదేండ్లలో ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకోని కాంగ్రెస్ నాయకులు ఓట్ల కోసం గ్యారెంటీ లేని వారంటీలేని పథకాలను ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టామంటూ బూటకపు వాగ్దానాలు ఇస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ దశాబ్దాల కాలంపాటు దేశాన్ని పాలించి దళితులకు ఏం ఒరగబెట్టిందో ప్రకటించలేని నాయకులు ఉనికి కోసం పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి కొత్తపెల్లి కోటిలింగాచారి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బట్టు సాంబయ్య, నాయకులు పరికి నవీన్, అరుణ్, పోడేటి సాగర్, బొమ్మకంటి అనిల్, బొట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.


నాగరాజుపల్లిలో సర్పంచ్ గోనె శ్రీదేవి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న దళితులు

## 'కాంగ్రెస్ వాళ్లకు ఓటు అడిగే హక్కు లేదు'


కంది కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్

చెన్నారావుపేట, నవంబర్ 14: కాంగ్రెస్ నాయకులకు ఓటు అడిగే హక్కు లేదని బీఆర్‌ఎస్ పార్టీ మండల కన్వీనర్ కంది కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇంటి యజమానులకు తెలియకుండా వారి రేషన్‌కార్డులు చూపి సిమెంట్ బిల్లులు డ్రా చేసుకున్న ఘనత స్థానిక కాంగ్రెస్ నాయకులదని చెప్పారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి మండలంలో రూ.150కోట్లతో గ్రామాల్లో అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఎమ్మెల్యేగా పెద్ది మండలంలో గృహలక్ష్మి పథకం ద్వారా 650 ఇండ్లు మంజూరు చేయించారని, అందులో మొదటి విడుతగా 400 గృహలకు ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చినట్లు వివరించారు. ఎన్నికల కోడ్ రావడంతో నిధులు ఆగాయని, కోడ్ ముగిసిన వెంటనే డబ్బులను లబ్ధిదారులకు అందించనున్నట్లు చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే పెద్దిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

నర్సంపేట రూరల్, నవంబర్ 14: మండలంలోని గురిజాలకు చెందిన బండారి కుమారస్వామి కొందరితో కలిసి మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి రైతు సహకార కమిటీ కన్వీనర్ అన్నకోమలా రాజమల్లు, మాజీ ఎంపీటీసీ గడ్డం కొమురయ్య, మాజీ సర్పంచ్ పోటు రాయపురెడ్డి గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు బండారి చిన్నవెంకటేశ్వర్లు, పత్రి కుమారస్వామి, గజ్జి రాము ఉన్నారు.


గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నాయకులు